# జనవరి 24

# జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుందాం!!

# బాలికల హక్కులను కాపాడుకుందాం !!

– సమత విభాగం, జనవిజ్ఞాన వేదిక, కడప జిల్లా

మన దేశంలో ప్రతి సం వత్సరం జనవరి 24ను 'జాతీయ బాలికా దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. భారతదేశ ఏకైక మహిళా ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానిగా పదవీ స్వీకారం చేసిన ఈరోజును యుపిఎ ప్రభుత్వం 2009లో 'బాలికా దివస్' (National Girl Childday) గా ప్రకటించింది. బాలికా విద్యకు ప్రోత్సాహం, అన్ని రంగాల్లో బాలికల ఎదుగుదలే ఈ రోజు యొక్క లక్ష్యంగా ప్రభుత్వం చెప్పుకుంది. వారికున్న హక్కులపట్ల, వారి క్షేమం కోసం చేసిన చట్టాల పట్ల బాలికలకు అవగాహన కల్పించడమే బాలికాదినోత్సవ ముఖ్య ఉద్దేశం.

'ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం' అంటూ అణుబాంబు ప్రయోగాలు, అంతరిక్షయానాలు లాంటి జటిలమైన రంగాల్లో సునాయాసంగా మహిళలు రాణిస్తున్నారు. అయినా నేటికీ బాలికల విద్య, పురోగతి శాతం చాలా తక్కువగానే ఉంది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో మరింత వెనుకబాటుతనం కన్పిస్తుంది. అవిద్య, అనారోగ్యం, నిర్లక్ష్యం లాంటి కుటుంబపరమైన సమస్యలే కాక లింగ వివక్ష, భ్రూణహత్యలు, అత్యాచారాల్లాంటి సామాజిక విషవలయాలలో ఆడశిశువు భవితవ్యం కొట్టు మిట్టాడుతున్నది. మన దేశంలో బాలికల విద్య సగటున 50% మాత్రమే నంటే ఆవేదన కలిగిస్తున్నది.



**"సేవ్ ద గర్ల్ చైల్డ్" స్వచ్ఛంధ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైన నిజాలు కొన్ని –**

1. 1991 మరియు 2001 జనాభా గణన– స్త్రీ పురుష నిష్పత్తిలో అంతరం పెరుగుతున్నట్లు తేల్చింది.
2. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 1000 మంది పురుషులకు 940 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారు.
3. పిండస్థ దశలో బాలురతో పోలిస్తే బాలికా శిశుమరణాలు చాలా ఎక్కువగా నమోదవుతున్నాయి.
4. లింగవివక్ష వల్ల ప్రతి 6గురు బాలికల్లో ఒకరు మరణిస్తున్నారు.
5. 5–9 సంవత్సరాల మధ్య 57% బాలికలు నిరక్షరాస్యులుగా వున్నారు.
6. వివాహ వయసు రాకముందే 75% బాలికలు తల్లులవుతున్నారు.
7. ప్రతి ఇద్దరిలో ఒక బాలిక 'పోషకాహార లేమి' ఎదుర్కొంటున్నది.
8. ప్రతి 10 మంది మహిళల్లో ఒకరు లైంగిక వేధింపులకు గురైనవారే.

"సేవ్ ద గర్ల్ చైల్డ్" సర్వే అధ్యయనం యుపిఎ ప్రభుత్వ హయాంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలికల విభాగం ఏర్పాటుకు దారితీసింది. ప్లానింగ్ కమిషన్ 11వ పంచవర్ష ప్రణాళికలో ఒక గ్రూపును ఏర్పాటు చేసింది. అందులో బాలికా విభాగం ఒక ఉప గ్రూపుగా పనిచేస్తున్నది. 11–18 సంవత్సరాల మధ్య వయస్సున్న బాలికల్లో వరకట్న నిషేధచట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం. గృహహింస నిరోధక చట్టం పట్ల అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ఈ ఉపగ్రూపు పని మొదలుపెట్టింది. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ద్వారా యూత్ ఫెస్టివల్స్, గర్ల్స్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రధానం లాంటి అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

ప్రస్తుతం అధికారంలో వున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం 'భేటీ బచావో', 'భేటీ పఢావో' లాంటి పథకాలు ఎన్ని ప్రకటించినప్పటికీ అవి అమలులో నీరుగారుతున్నాయి. నిర్భయ ఘటన సమాజంలో స్త్రీ ఎలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నదో, జీవించే హక్కును ఎలా నష్టపోతున్నదో లోకానికి విశదపరచింది. ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో బాలికలు బాల్యం నుంచే రకరకాల ఆంక్షలనే ముళ్ళపొదల మధ్య ఎదగలేని మల్లెమొగ్గలవుతున్నారు.

చైతన్యవంతులైన యువతులతోనే కుటుంబ అభివృద్ధి గాని, దేశాభివృద్ధి గాని ముడిపడి వుంటాయి. సమాజంలో మహిళలను 'భోగ్యవస్తువు' గా భావించే తీరు మారాలి. వ్యక్తిత్వ వికాసం

## ఆడపిల్ల ఎందులో తక్కువ?

- మదర్ థెరెసాను మించిన సమాజ సేవిక ఉన్నారా?
- దేశంలోనే తొలి ఉపాధ్యాయిని సావిత్రీబాయి ఫూలె ఆదర్శం కాదా?
- రాష్ట్రపతిగా పోటీచేసిన లక్ష్మీ సెహగల్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనలేదా?
- ప్రశ్నిద్దామా? వద్దా? అన్నదే మేధావుల ముందున్న ప్రశ్న అని చెప్పిన ప్రముఖ చరిత్రకారిణి రోమిల్లా థాపర్ స్ఫూర్తిదాయిని కాదా?
- మానవ కంప్యూటర్ శకుంతలదేవి ప్రజ్ఞకు సాటి ఉన్నదా?
- భారత సంతతి ఆస్ట్రోనాట్ కల్పనాచావ్లా ధీరత్వం మరచిపోగలమా?
- టెన్నిస్‌తో ప్రపంచాన్ని మెప్పించిన సానియామీర్జా అమ్మాయి కాదా?
- యం.యస్. సుబ్బలక్ష్మి సంగీతం వీనులవిందైన సుప్రభాతం కాదా?
- సినీ దర్శకురాలిగా గిన్నిస్ రికార్డు విజయనిర్మల సొంతంకాదా?
- బృందాకారత్, మేధాపట్కర్ సమరశీలతతో ఎవరు పోటీ పడగలరు?
- "దైవకణం" శోధనలో పాల్గొన్న అర్చనాశర్మ ఇండియన్ అని తెలుసా?
- తొలి మహిళా ఐపియస్ ఆఫీసర్ కిరణ్‌బేడి స్ఫూర్తిదాత కాదా?
- ఆర్‌వియం అధికారిణిగా పనిచేసిన ఉషారాణి నిజాయితీలో ఎంత గొప్ప ఆదర్శం!
- కవయిత్రి 'మొల్ల'రాసిన రామాయణం భక్తులకు పారాయణం కాదా?
- కడప జడ్‌పి బోర్డు ఛైర్మెన్‌గా కొటిరెడ్డి రామసుబ్బమ్మ రాణించలేదా?
- 'పాడుతాతీయగా' ఫేమ్ సబీహా కడప అమ్మాయే అని మీకు తెలుసా?

పెంచుకొని స్వీయ గౌరవాన్ని నిలబెట్టుకొని భారతీయ మహిళ ఎదగాలంటే, వారికున్న అవకాశాల పట్ల బాలికలకు సంపూర్ణ అవగాహన కలగాలి. అందుకు బాలికా దినోత్సవాలు వేదికలు అయితేనే సార్థకం. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం, మీడియా ఈ దిశలో చేయగలిగింది చాలా వుందని జనవిజ్ఞాన వేదిక భావన.

**జపాను దేశంలో హోక్కైడో ద్వీపంలోని ఒక మారుమూల ప్రాంతమైన కమి-షిరాటకి అనే పట్టణంలోని రైల్వేస్టేషన్ నిరుపయోగంగా తయారైందని ప్రభుత్వం భావించింది. అందువల్ల ఆ స్టేషన్‌ను మూసివేతకు ప్రయత్నించింది. అయితే ఒక పాఠశాల విద్యార్థిని బడికి పోవటానికి ఆ స్టేషన్ గుండా వెళ్ళే రైలుసేవలను ఉపయోగించుకున్నట్లు జపాన్ ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ బాలిక గ్రాడ్యుయేషన్ పూర్తి అయ్యేంతవరకు పాఠశాల వేళలకు అనువుగా రైలు నడపాలని నిర్ణయించింది. బాలికల విద్య మీద ఆ దేశానికున్న శ్రద్ధే బహుశా జపాన్‌ని అగ్రస్థానాన నిలిపిందేమో!**

గార్గి, మైత్రేయిలు నడయాడిన నేల అని ఘనంగా చెప్పుకోటమేగాని, బాలికా విద్య సజావుగా సాగడానికి మన ప్రభుత్వం చాలా కృషి చేయాల్సివుంది. నిర్భయంగా, గౌరవప్రదంగా, సంకోచరహితంగా తనను తాను ధైర్యంగా వ్యక్తీకరించుకోగలిగే అవకాశం ప్రతి బాలికకు, ముఖ్యంగా గ్రామీణ బాలికలకు దక్కాలని జెవివి అభిలషిస్తుంది. భయం, వివక్ష లేని ఓ మానవీయ సమాజంలో పెరిగే బాలిక మాత్రమే రేపటి సమాజానికి దిక్సూచి కాగలదు. భావి భారతానికి దిశా నిర్దేశం చేయగలదు. ప్రభుత్వమే కాక పౌరసమాజం, స్వచ్ఛంద సంస్థలు, మహిళా, ప్రజాసంఘాలు ఈ దిశగా అడుగులు వేయాలని జనవిజ్ఞాన వేదిక ఆకాంక్ష.

**బాలికల హక్కుల రక్షణ కోసం, మహిళల అభివృద్ధికోసం జన విజ్ఞాన వేదిక ఈ క్రింది సూచనలు చేస్తున్నది.**

1. భ్రూణ హత్యల నివారణ కోసం సమాజంలో చైతన్యాన్ని పెంచేందుకు, చట్టాల అమలుకు ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి.
2. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లను ఆమోదిస్తూ తక్షణమే చట్టం చేయాలి.
3. తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి ఫూలె జన్మదినాన్ని జాతీయ మహిళా దినంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి.
4. నిర్భయ చట్టాన్ని కఠినంగా అమలుచేయాలి.
5. పని ప్రదేశంలో లైంగిక వేధింపుల చట్టాన్ని అమలయ్యేలా కమిటీలు ఏర్పాటుచేయాలి.
6. మహిళా దినం, బాలికా సంరక్షణ దినం లాంటి సందర్భాల్ని ప్రభుత్వమే స్ఫూర్తివంతంగా నిర్వహించాలి.
7. నీరుగారిపోయిన జల్ పథకాన్ని పునరుద్ధరించాలి.
8. విద్యాసంస్థల్లో రీడింగ్ రూమ్‌లు సక్రమంగా నిర్వహించాలి. వార్తాపత్రికలను, విజ్ఞానదాయక పుస్తకాలను అమ్మాయిలకు అందుబాటులో వుంచాలి.
9. బాలికల శారీరక, మానసిక ఆరోగ్యంపట్ల, ఎదిగే ఆడపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపట్ల అవగాహన పెరిగేలా సైకాలజిస్టులచే అవగాహన కల్పించాలి.
10. మహిళలు సాధించిన విజయాల్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి.
11. బాలికల పాఠశాలల్లో కుట్టు, డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్, కంప్యూటర్ శిక్షణ, మార్షల్‌ఆర్ట్స్ లాంటి అంశాల్లో ప్రత్యేక శిక్షకులను నియమించాలి.

బాలికా సంరక్షణా దినాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, మహిళల హక్కులపట్ల, సమానత్వంపట్ల ఆసక్తివున్న ప్రతి సంస్థకూ జనవిజ్ఞాన వేదిక, కడప జిల్లా కమిటి విజ్ఞప్తి చేస్తున్నది.

**బాలికల హక్కులను కాపాడుకుందాం !!**
**జాతీయ బాలికా దినోత్సవం జరుపుకొందాం!!**


విజ్ఞానాభివందనాలతో...

**సమత విభాగం**
**జనవిజ్ఞాన వేదిక**
(AIPSN అనుబంధం) కడపజిల్లా కమిటి

ఫోన్స్ : 9642488205, 9704621122, 9849804467


VINAG GRAPHICS - 9441040285